జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శనివారం | 10-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 563 పేజీలు: 4 వెల : రూ.7



చలి జ్వరంతో..

## గజగజ

* రాత్రిపూట తగ్గుతున్న ఉష్ణోగ్రతలు * దట్టంగా మంచుకురుస్తుండడంతో శ్వాసకోశవ్యాధుల బారిన జిల్లావాసులు * జ్వరం, దగ్గు, జలుబుతో ఆసుపత్రులకు రోగులు * కిటకిటలాడుతున్న ఆసుపత్రులు * టెస్టుల పేరిట రోగులను పిండేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు

**శ్రీకాకుళం, జనవరి 9 (వార్త):** చలి.. మంచు తీవ్రతతో జిల్లాలో జ్వరం, దగ్గు, జలుబుతో పలువురు బాధపడుతున్నారు. రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడం, సాయంత్రం ఆరు గంటలకే మంచు కురుస్తుండడంతో పలువురు శ్వాసకోశ బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. చల్లటి వాతావరణం కారణంగా వైరస్, బ్యాక్టీరియా జీవితకాలం పెరగడం.. చలికి ఇంట్లో దగ్గర దగ్గరగా కుటుంబసభ్యులు ఉండటంతో వైరస్ విస్తరిస్తోంది. చలి జ్వరంతో పెద్ద ఎత్తున రోగులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు బారులు దీరుతున్నారు. కొందరు మెడికల్ షాపుల్లోనే మందులు కొనుగోలు చేసుకుంటున్నారు. ఆసుపత్రులకు వస్తున్న కేసుల్లో అధిక శాతం జలుబు, దగ్గు, జ్వరం కేసులే ఉంటున్నాయి. అలాగే అస్తమా, టీబీ వ్యాధికి గురైన వారు, ఊపిరితిత్తుల సమస్య ఎదుర్కొనే వారు, గుండె, డయాలసిస్ చేసుకునే వారు చలి తీవ్రతకు శ్వాసకోశ రోగాలకు గురవుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులు వెళితే పలు టెస్టుల పేరిట పిండేస్తున్నారు. ఆసుపత్రికి వెళ్లిన ప్రతి ఒక్కరికీ రక్త పరీక్ష తప్పనిసరిగా చేయిస్తున్నారు. దీంతో రక్త పరీక్ష కేంద్రాల వద్ద రోగులు బారులు దీరుతున్నారు.



# ప్రైవేట్ ట్రావెలర్స్.. నిలువుదోపిడీ

* మూడు రెట్లు చార్జీలు పెంచేసిన నిర్వాహకులు * సామాన్య, మధ్యతరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్న ధరలు * ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులకు మొదలైన 'సంక్రాంతి' పండుగ! * రెండు నెలల కిందటే రైళ్ల రిజర్వేషన్ ఫుల్ * సొంత ఊరికి ప్రయాణించాలంటే ప్రైవేట్ ట్రావెలర్స్ గతి

**శ్రీకాకుళం, జనవరి9(వార్త):** 'సంక్రాంతి' లాంటి పెద్ద పండుగలు వచ్చాయంటే చాలు ప్రైవేట్ ట్రావెల్స్, ప్రైవేట్ బస్సుల నిర్వాహకులకు మొదలవుతుంది అసలు పండుగ. పండక్కి సకుటుంబ సమేతంగా సొంత ఊర్లకు వెళ్లాలంటే ట్రైన్ల తర్వాత బస్సులే దిక్కు. ఉద్యోగాల నిమిత్తం, చదువుల నిమిత్తం, చిన్నో పెద్ద పని చేసుకుంటూ బతుకుతున్న కుటుంబాలు సంక్రాంతికి సొంత ఊరికి ప్రయాణించాలంటే ఓ నెల జీతం సరిపోదేమో. సాధారణ రోజుల కంటే పండగ సమయాల్లో రెండు మూడు రెట్లు ధరలు పెంచేసి టికెట్లు విక్రయిస్తారు. ఆర్టీసీలో సరిపడా సర్వీసులు ఉండకపోవడంతో.. ప్రయాణికులు ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తుంటారు. ఇదే అదునుగా రిజర్వేషన్లు, బుకింగ్‌ల పేరుతో ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యం నిలువు దోపిడీకి పాల్పడుతోంది. హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వెళ్లాలంటే సాధారణ రోజుల్లో ఏసీ బస్సుల్లోని స్లీపర్ అయితే 1500లోపు, నాన్ ఏసీ అయితే రూ.1000లు, సిట్టింగ్ అయితే ఏసీ బస్సుల్లో రూ.1000లోపు, నాన్ ఏసీ అయితే రూ.800లోపు ధరలు ఉంటాయి. అదే పండగ సమయంలో ఈ ధరలు మూడు రెట్లు అధికంగా ట్రావెలర్స్ వసూలు చేస్తున్నారు. సంక్రాంతి పండగ ఏమో కానీ జర్నీ విషయానికొస్తేనే గుండె గుబేలు మనేలా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. రానుపోను ప్రయాణాలు పెద్ద సమస్యగా మారింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ ప్రాంతాల నుంచి శ్రీకాకుళం జిల్లాకు వచ్చే వాళ్లు రెండు నెలలు ముందుగానే రైళ్లలో రిజర్వేషన్లు చేసుకుంటున్నారు. ఫస్ట్ ప్రియారిటి ట్రైన్ జర్నీకి ఇచ్చినప్పటికీ రిజర్వేషన్లు టికెట్స్ కొందరికి మాత్రమే దక్కుతున్నాయి. ప్రత్యేక రైళ్లను వేసినప్పటికీ వాటిలో కూడా టిక్కెట్స్ దొరక్కపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు ప్రైవేట్ ట్రావెలర్స్‌ను ఆశ్రయిస్తున్నారు. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్ ట్రావెలర్స్ నిర్వాహకులు ధరలను పెంచేసి ప్రయాణీకులను కొల్లగొట్టేస్తున్నారు. హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం, కొత్తూరు, పాతపట్నం, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం వరకూ సుమారు వందకుపైనే ప్రైవేట్ ట్రావెల్ బస్సులు నడుస్తున్నాయి. పండగ సమయం కావడంతో ఈ బస్సులు మరో 50 వరకూ పెరిగే అవకాశం ఉంది. ఆర్టీసీ అధికారులకు పండగకు కేవలం శ్రీకాకుళం నుంచి విజయవాడ వరకు మాత్రమే బస్సు సర్వీసులు నడుపుతున్నారు. హైదరాబాద్‌కు గతంలో బస్సులు నడిపేవారు. ప్రస్తుతం బస్సు సదుపాయం లేదు. దీంతో ప్రయాణికులు ప్రైవేట్ ట్రావెలర్స్‌ను ఆశ్రయించాల్సివస్తోంది. అయితే జిల్లా రవాణా శాఖాధికారులు మాత్రం అదనపు చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. ఇవన్నీ ఒత్తిమాటలు, గాలిమాటలేనని ప్రయాణికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ప్రైవేట్ ట్రావెలర్స్ పలు యాప్‌ల్లో ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సు టిక్కెట్ల ధరలను ప్రదర్శిస్తున్నారు. జిల్లా రవాణా శాఖాధికారులకు ఇది తెలియదో లేక తెలియనట్టు నటిస్తున్నారో అర్థం కావడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.



### అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు
**- విజయ సారధి, ఉప రవాణా కమిషనర్**

సంక్రాంతి పండుగ వేళ ప్రైవేటు బస్సుల్లో ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప రవాణా కమిషనర్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ప్రైవేటు బస్సు ఆపరేటర్లు, యజమానులతో ఆయన శుక్రవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. సంక్రాంతి పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని అనధికారికంగా చార్జీలు పెంచి ప్రయాణికులకు భారం కలిగించవద్దని, సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. ప్రయాణ సమయంలో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని ఆపరేటర్లను ఆదేశించారు. రవాణా శాఖ అధికారులు నిర్వహించే తనిఖీల సమయంలో ప్రయాణికుల నుంచి నేరుగా 'ఫీడ్‌బ్యాక్‌ను తీసుకుంటామని, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. బస్సుల ఫిట్‌నెస్ విషయంలోనూ రాజీ పడకూడదన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం రవాణా శాఖ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబరును అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ప్రతి బస్సులోనూ ప్రయాణికులకు స్పష్టంగా కనిపించేలా 9281607001 మొబైల్ నంబరును ప్రదర్శించాలని డిటిసి ఆదేశించారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఈ నంబరుకు సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా మోటారు వాహన తనిఖీ అధికారులు, ప్రైవేటు బస్సు ఆపరేటర్లు పాల్గొన్నారు.



### కలప అక్రమ రవాణాపై అటవీశాఖ ఉక్కుపాదం

* రూ.2లక్షల విలువైన కలప స్వాధీనం, రెండు వాహనాలు సీజ్

**నరసన్నపేట, జనవరి9(వార్త):** అక్రమంగా కలపను రవాణా చేస్తున్న రెండు వాహనాలను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. రూ.2 లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని నరసన్నపేట ఫారెస్ట్ రేంజర్ జగదీష్ తన కార్యాలయంలో వెల్లడించారు. పోలాకి మండలం సముద్రతీర ప్రాంతం నుంచి సర్వే, అక్కిస రకాల కలపను కొట్టేసి వాటిని వాహనాల్లో ఒడిశాలోని రాయగడకు కొందరు తరలిస్తుండగా అటవీ అధికారులు పట్టుకున్నారు. అక్రమ కలప రవాణాకు పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేశామని రేంజర్ జగదీష్ తెలిపారు.



5లో

### ఉద్యోగం చేసుకోండి.. రాజకీయాలు చేయొద్దు

* నౌపడ వీఆర్వోపై అధికార పార్టీ నాయకుల ఆగ్రహం

# నగరపాలక సంస్థ కమిషనర్... అవుట్





* మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ కమలాకర్‌కు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు * రథసప్తమి వేడుకల వేళ కమిషనర్ బదిలీపై సర్వత్రా అనుమానాలు * 'ఆ ఇద్దరి' పెత్తనమే కారణమా? * కార్యాలయంలో చక్రం తిప్పుతున్న షాడో అధికారులు * రెండు వర్గాలుగా విడిపోయిన ఉద్యోగులు

**శ్రీకాకుళం, జనవరి 9 (వార్త):** జిల్లా కేంద్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'సిక్కోలు రథసప్తమి' వేడుకలకు సర్వం సిద్ధమవుతున్న వేళ.. నగరపాలక సంస్థలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. మున్సిపల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావుపై ఆకస్మిక బదిలీ వేటు పడటం ఇప్పుడు నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ బదిలీ వెనుక కార్పొరేషన్‌లో తిష్టవేసిన 'ఆ ఇద్దరు' ఉద్యోగుల హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించాల్సిన రథసప్తమి ఉత్సవాల కోసం రోడ్ల సుందరీకరణ, వెడల్పు, పెయింటింగ్స్, సింహద్వారాల అలంకరణ, పారిశుద్ధ్యం వంటి కీలక పనులు పెండింగ్‌లో ఉన్నాయి. భక్తుల సౌకర్యార్థం మంచినీరు, క్యూలైన్ల నిర్వహణ, ఫాగింగ్ వంటి పనులను పర్యవేక్షంచాల్సిన సమయంలో కమిషనర్‌ను బదిలీ చేయడం విమర్శలకు దారితీస్తోంది. ప్రస్తుతం మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ కమలాకర్‌కు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

### 'షాడో' ఉద్యోగుల చక్రం!

నగరపాలక సంస్థలో సుదీర్ఘకాలంగా పాతుకుపోయిన ఒక రెవెన్యూ ఆఫీసర్, ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కమిషనర్ బదిలీలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. సదరు రెవెన్యూ అధికారి గత 15 ఏళ్లుగా ఇక్కడే కొనసాగుతుండగా, ఆర్‌ఐ కూడా ఏడేళ్లుగా నగరపాలక సంస్థ కార్యాలయంలో చక్రం తిప్పుతున్నారు. సీనియర్లకు రావాల్సిన పదోన్నతులను అడ్డుకుంటూ, ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ నేతలకు అడుగులకు మడుగులొత్తుతూ తమ పబ్బం గడుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. స్థానిక రాజకీయ నేతల అండతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారని, వీటిని కమిషనర్ ప్రసాదరావు ఎప్పటికప్పుడు నిలదీయడమే ఆయన బదిలీకి కారణమని కార్పొరేషన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### రెండు వర్గాలుగా ఉద్యోగులు

ఈ ఇద్దరు ఉద్యోగుల అతిజోక్యంతో కార్పొరేషన్ సిబ్బంది రెండు వర్గాలుగా విడిపోయారు. దీనివల్ల పరిపాలన కుంటుపడటమే కాకుండా, సామాన్య ప్రజలు కార్యాలయానికి వస్తే పనులు కాక ఇబ్బందులు పడుతున్నారు. 15 ఏళ్లుగా ఎన్నికలు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇంతటి డైనమిక్ ఆఫీసర్ దృష్టిలో పడకుండానే ఈ 'ఆకస్మిక బదిలీ' నాటకం జరిగిందా? లేక ఆయనను కూడా తప్పుదోవ పట్టించారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### కలెక్టర్ జోక్యం కోరుతున్న సిబ్బంది

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఎ) కు రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు అందుకున్న కమిషనర్ వెనుకాడటంతో.. ఇప్పుడు అందరి చూపు కలెక్టర్ వైపే ఉంది. సుదీర్ఘకాలంగా ఇక్కడే ఉంటూ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న ఆ ఇద్దరు 'షాడో' ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పదోన్నతుల కోసం వేచి చూస్తున్న అర్హులకు న్యాయం చేయాలని సిబ్బంది కోరుతున్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ధర్మాన క్యాంప్ ఆఫీస్ మద్దతుదారులు అని ముద్రపడిన వీరిద్దరి వ్యవహార శైలిపై కలెక్టర్ దృష్టి సారిస్తే తప్ప కార్పొరేషన్ గాడిలో పడదని ప్రజలు భావిస్తున్నారు.

**శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆ ఇద్దరి హయాంలో జరుగుతున్న వ్యవహారాలపై.. మరో సంచికలో కలుద్దాం)**



### ఏడు రోజులు.. ఏడు రంగులు.. ఏడు చక్రాల స్ఫూర్తితో..
# రథసప్తమి వేడుకలు

5లో

* సిక్కోలులో రథసప్తమికి అంకురార్పణ * ప్రచార రథాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే * ఈనెల 19 నుంచి 25 వరకు వేడుకలు

## గిరిజనులకు చేప పిల్లల పంపిణీ



**మందస, జనవరి 9(వార్త):** ఐటీడీఏ ఆధ్వర్యంలో శనివారం మందస మండలంలో చేప పిల్లల పంపిణీ చేశారు. ప్రత్యేక కేంద్ర సహాయ నిధులు గిరిజన ఉప ప్రణాళిక పథకం 2020-2021 కింద 100శాతం రాయితీతో 80-100 ఎంఎం సైజు కట్ల, మ్రిగాల్, రోహు రకాల చేప పిల్లల పంపిణీ బొగాబంద, కొండలోగాం, కొంకడాపుట్టి, సాబకోట, చీపి, నర్సింగిపురం తదితర గ్రామ పంచాయతీల్లో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బావన దుర్యోధన చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఉన్న చెరువుల్లో చేప పిల్లలను విడిచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీఓ తిరుమలకుమార్, ఫిషరీస్ డిపార్ట్మెంట్ ఎఫ్డీఓ ధర్మరాజు, ఫిషరీస్ అసిస్టెంట్ జ్యోత్స్న, మండల ప్రధాన కార్యదర్శి సాలిన మాధవరావు, మందస పీఏసీఎస్ చైర్మన్ తమరి భాస్కరరావు, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ లబ్బ రుద్రయ్య, తెలుగు యువత అధ్యక్షుడు ఎం.నవీన్‌కుమార్, క్లస్టర్ కన్వీనర్ ముంజేటి చంద్రశేఖర్, యూనిట్ కన్వీనర్ రాజాన మహేష్, సవర చంద్రశేఖర్, డోల తిరుపతి, గుంట నారాయణ, అవుగాన ఈశ్వరరావు, సనపల దీనబంధు, సవర రాజు, కుదుళ్ల బాలరాజు, సవర ఈశ్వరరావు, సవర జగన్ సవర శివ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్‌లో సంక్రాంతి వేడుకలు



**పోలాకి, జనవరి 9 (వార్త):** ఈదులవలసలోని ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉత్సాహం, సంప్రదాయాల సందడి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పైడి ప్రవీణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సంక్రాంతి పండగ ప్రాముఖ్యత, భారతీయ సంస్కృతిలోని సంప్రదాయాల గురించి వివరించారు. అనంతరం భోగి మంటను వెలిగించి పండగ శుభారంభం చేశారు. విద్యార్థులు నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ వేడుకల ద్వారా విద్యార్థుల్లో సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమం ఉల్లాసభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## కొబ్బరి చెట్టు పైనుంచి జారిపడి వ్యక్తి మృతి




**పోలాకి, జనవరి 9 (వార్త):** కోదూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన టెంక సంజీవరావు (50) కొబ్బరి బొండాలను తీసేందుకు చెట్టును ఎక్కిన సమయంలో ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనను గమనించిన గ్రామస్థులు వెంటనే 108 అత్యవసర వాహనం ద్వారా ఆయనను నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ఈ సంఘటన తీవ్రంగా విషాదంలో ముంచింది.

## ఆకట్టుకున్న చిన్నారుల హరిదాసు వేషధారణ



**నరసన్నపేట, జనవరి 9(వార్త):** నరసన్నపేటలోని పలు పాఠశాలల విద్యార్థులు శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హరిదాసుల వేషధారణలో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయ దుస్తులు, భక్తిగీతాలతో విద్యార్థులు సంక్రాంతి సంబరాలకు ప్రత్యేక శోభను తీసుకువచ్చారు. సంక్రాంతి పండుగ విశిష్టత, సంప్రదాయాలు, సంస్కృతి ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసేలా పాఠశాల యాజమాన్యాలు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశాయి. భోగి, సంక్రాంతి సందర్భంగా పాఠశాలల్లో రంగవల్లుల పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. కాగా, రేపటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రారంభమవుతున్నట్లు పాఠశాల అధికారులు తెలిపారు.

## టెక్కలిపాడు సర్పంచ్ బువ్వాజీకి వైసీపీ శ్రేణుల సంఘీభావం



**జలుమూరు, జనవరి 9 (వార్త):** జలుమూరు మండలం టెక్కలిపాడు సర్పంచ్ బువ్వాజీపై ఇటీవల జరిగిన దాడిని ఖండిస్తూ వైసీపీ శ్రేణులు సంఘీభావం ప్రకటించాయి. గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న సమయంలో కొందరు టీడీపీ వర్గీయులు దాడి చేయడంతో బువ్వాజీ గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందారని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణచైతన్య తెలిపారు. చికిత్స అనంతరం ఆయన స్వగృహానికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ శ్రేణులు ర్యాలీగా టెక్కలిపాడు గ్రామానికి చేరుకుని సర్పంచ్ బువ్వాజీని కలుసుకుని ధైర్యం చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజా సేవ చేస్తుండగా దాడులు చేయడం సరికాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధుల భద్రతకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ఊళ్లకు వెళ్తే పోలీసులకు సమాచారమివ్వాలి

**నరసన్నపేట, జనవరి 9(వార్త):** సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా తమ స్వగ్రామాలకు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్తే తప్పనిసరిగా సంబంధిత పోలీస్ స్టేషన్లకు ముందుగా సమాచారం అందించాలని నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం నరసన్నపేట సీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, పండుగ సెలవుల సమయంలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ల లోని విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలను తప్పనిసరిగా బ్యాంక్ లాకర్లలో భద్ర పరచుకోవాలని సూచించారు. ముందుగా సమాచారం అందిస్తే ఆయా ఇళ్లపై పోలీ సులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి భద్రత చర్యలు చేపడతామని సీఐ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసుల సహకారం అందించాలని ఆయన కోరారు.



# పట్టణాభివృద్ధి..సుందరీకరణకు ప్రాధాన్యత

**-మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు**

**- కేటీ రోడ్డులో సెంట్రల్ ఎలక్ట్రికల్ లైటింగ్ పోల్స్, బ్యూటీఫికేషన్ ప్రారంభం**



**పలాస, జనవరి 9 (వార్త):** పలాస- కాశీబుగ్గ పురపాలక సంఘం అభివృద్ధి, సుందరీకరణ చేపట్టడమే పాలకవర్గ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కేటీ రోడ్డులో సెంటర్ లైటింగ్‌పోల్స్, ఎలక్ట్రికల్ రూఫ్‌తో అలంకరించిన విద్యుత్ దీపాలు, సరికొత్త రంగులు వేసిన డివైడర్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సౌకర్యాలతో పాటు రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెయిన్ రోడ్‌లో సుందరీకరణ చేపట్టామన్నారు. గతంలో ప్రధాన రహదారుల్లో సరైన విద్యుత్ దీపాలు ఉండేవి కావని, దీంతో వాహనదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రాత్రి సమయాల్లో ముందు వెళితే వాహనాలు కనబడక తరచూ ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. ఈ విద్యుత్తు బ్యూటిఫికేషన్‌తో వాహనదారులు తమ ప్రయాణాన్ని సాఫీగా సాగిస్తూ గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. ఏపీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీల అభివృద్ధిలో భాగంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కృషితో పలాస- కాశీబుగ్గ పురపాలక సంఘం నగరీకరణ వైపు పయనింపచేయడమే లక్ష్యంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు గురుటి సూర్యనారాయణ, టీడీపీ పలాస పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, పలాస ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టీడీపీ నేతలు గాలి కృష్ణారెడ్డి, ఎం.చిన్ని, త్యాడి, పిట్ట రవి, టంకాల రవిశంకర్ గుప్తా, కొత్త సత్యం తదితరులు పాల్గొన్నారు.

## పేద క్రీడాకారుడికి జగదీష్ ఆర్థికసాయం

**శ్రీకాకుళం, జనవరి 9(వార్త):** శ్రీకాకుళంలోని గూనపాలెంకు చెందిన అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సతివాడ హిమశేఖర్..ఈజిప్ట్ దేశం కైరో నగరంలో ఈనెల 13 నుంచి 18 వరకు జరిగే పారా వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి ఎంపికయ్యాడు. కానీ అక్కడకు వెళ్లేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతునాన్నాడని తెలుసుకున్న అంబేద్కర్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ చైర్మన్ కోంద్రు జగదీశ్వరరావు స్పందించారు. రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ ఆయన మాట్లాడుతూ నిరుపేద క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, హిమశేఖర్ రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లోలో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించి అనేక విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ అంపిలి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



## విద్యతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ



**జి.సిగడాం, జనవరి9(వార్త):** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నడిమివలసలో పంచాయతీ కార్యదర్శి కొంచాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం అవరణలో మండల స్థాయి క్విజ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ జి.రామకృష్ణారావు,ఎంఈఓ అరసాడ రవికుమార్, ముళ్ళ శ్రీనివాసరావు విచ్చేశారు. నడిమివలస, జి.సిగడాం, ఎందువ, బాతువ, సంతవురిటి పలు గ్రామాల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రథమ బహుమతిని ఎందువ, ద్వితీయ బహుమతి నడివలస, తృతీయ బహుమతిని జి.సిగడాం శ్రీ సత్యసాయి విద్యా మందిర్ పాఠశాల విద్యార్థులు సాధించారు. విజేతలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్తుల బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని, విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలు జ్ఞాపకశక్తిని ఇనుమడింపజేస్తాయన్నారు. ప్రతీ ఒక్క విద్యార్థి చదువుతో జ్ఞాన్నాన్ని అందించే క్విజ్ తదితర పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ పోటీలలో ఎందువ, బాతువ, సంతవురిటి, నడిమివలస, జి.సిగడాం, సత్యసాయి విద్యామందిర్ ఉన్నత పాఠశాలల నుంచి 12 టీములు పాల్గొన్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ బాలి సావిత్రి, ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల రమణ, సర్పంచ్ ప్రతినిధి బాలి రమేష్, నాయకులు పొగిరి అప్పలనాయుడు, మీసాల ముసిలినాయుడు, బాలి తమ్మినాయుడు, మీసాల రామకృష్ణ, బాలి సంతోష్, బాలి అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

## 'సూర్యోదయ'లో సంక్రాంతి సంబరాలు

**మందస, జనవరి 9(వార్త):** ఓ వైపు భోగిమంటలు.. మరో వైపు హరిదాసు సామరాగ సంకీర్తనలు.. ఇంకో వైపు చిన్నారుల సంప్రదాయ వస్త్రధారణ.. కలగలిపి సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మందసలోని సూర్యోదయ స్కూల్ ఈ వేడుకలకు వేదికగా మారింది. ఆ స్కూల్ డైరక్టర్ మోణంగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంస్కృతి, సంప్రదాయాలతో సంక్రాంతి వేడుకలు వైభవంగా జరిగాయి. సూర్యోదయ స్కూల్లో సంక్రాంతి సంబరాలను ముందుగా స్కూలును మామిడి తోరణాలతో, అరటిచెట్లు, చెరుకుగడలతో అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలతో అలకరించారు. గంగిరెడ్లు, హరిదాసుల వేషధారణతో పిల్లలు టీచర్స్ చాలా చక్కగా ప్రదర్శించి పిల్లలపైన భోగి పళ్ళు వేశారు. ఆటపాటలతో వేషధారణతో, భోగి మంటలు చేసి పాలు పొంగించి పాయసం చేసి, విద్యార్థులకు పంచి పెట్టారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అలరించారు. సంప్రదాయవస్త్రధారణతో సంక్రాంతి శోభను తీసుకువచ్చారు.

డైరెక్టర్ మోణంగి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ పిల్లి లోకేశ్వరావు, ఉపాధ్యాయ బృందం పండగ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. హరిదాసు వేషధారణ, రంగవల్లులు, భోగి మంటలు, గాలిపటాలు వివిధ రకాల డ్యాన్స్ లు, ధింసా నృత్యంతో చిన్నారులు చాలా చక్కగా ప్రదర్శించి సందడి చేశారు. ఆట.పాటల్లో విద్యార్థుల ధింసా నృత్యం మరింత ఆకర్షణీయంగా నిలిచింది. భోగి, సంక్రాంతి, కనుమ పండగల గురించి వివరంగా తెలిపారు. కార్యక్రమంలో వెంకటరావు, ధర్మారావు, కాళీచరణ్, తులసీదాస్, ధర్మ, హేమంత్, దామోదర్, మంజు, అశ్విని, పూజ, మనీషా, మధు, మీనా, మీనా, సునీత, ఉషా రాణి, భవాని, జయలక్ష్మ, ప్రవీణ్, ధనరాజ్, అశ్విని, మంజు తదితర ఉపాధ్యాయులు అందరూ పాల్గొని సంక్రాంతి సంబరాలను విజయవంతంగా జరిపించారు.



## కన్నబాబుతో శ్యాంప్రసాద్ రెడ్డి భేటీ



**ఇచ్ఛాపురం, జనవరి 9 (వార్త):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త, మాజీ మంత్రి కురసాల కన్నబాబుతో ఇచ్ఛాపురం వైకాపా సమన్వయ కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్‌తో కలసి మర్యాదపూర్వకంగా శుక్రవారం భేటీ అయ్యారు. తనకు సమన్వయకర్తగా అవకాశం కలిగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ తదుపరి ఎన్నికల్లో ఖచ్చితంగా గెలవాలనే పట్టుదలతో పని చేయాలని సూచించారు. సీనియర్లను గౌరవించుకుంటూ, యువతను ఎన్నికలకు సిద్ధం చేయాలన్నారు.

## మకర సంక్రాంతి వేళ హరిదాసుల సందడి



**నరసన్నపేట, జనవరి 9 (వార్త):** మకర సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో నరసన్నపేటలో హరిదాసుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శుక్రవారం పుర వీధులలో హరిదాసులు హరి నామస్మరణ చేస్తూ భక్తి వాతావరణాన్ని నెలకొల్పారు. తలపై అక్షయపాత్రను ధరించి, చేతిలో తంబుర వాయిస్తూ వీధి వీధినా తిరుగుతూ వారు పండుగ శోభను మరింత పెంచారు. హరిదాసుల కీర్తనలు, భజనలు వినిపించడంతో పట్టణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు భక్తిశ్రద్ధలతో అక్షయ పాత్రలో దానాలు వేస్తూ వారి ఆశీర్వాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా పెద్దలు, చిన్నారులు ఆసక్తిగా హరిదాసులను దర్శించి సంక్రాంతి సంప్రదాయాలను గుర్తు చేసుకున్నారు. సంప్రదాయం, సంస్కృతి, భక్తి సమ్మేళనంగా సాగిన ఈ హరిదాసుల సందడి నరసన్నపేటకు పండుగ కాంతిని తీసుకొచ్చిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## పేకాట శిబిరంపై దాడి.. ఆరుగురి అరెస్టు

**నరసన్నపేట, జనవరి 9(వార్త):** కోమర్తి గ్రామ పరిధిలోని ఓ తోటలో అక్రమంగా పేకాట నిర్వహిస్తున్న ఆరుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించిన పోలీసులు పేకాటాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.19,660లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ కె.శేఖర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పండగల సమయంలో జూదం, పేకాట వంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలని సూచించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 'తేజేశ్వరరావు' పుట్టినరోజు.. అన్నదానం

**మందస, జనవరి 9(వార్త):** సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సిక్కోలు ఉద్దానం సేవా సమితి సభ్యుడైన తేజేశ్వరరావు(సోంపేట) పుట్టినరోజు సందర్భంగా రోడ్డుపై ఉండే అనాథలకు, అభాగ్యులకు అన్నదానం చేశారు. పుట్టినరోజున మంచి కార్యక్రమం నిర్వహించడంపై స్థానికులు తేజేశ్వరావును అభినందించారు. ఎవరివైనా పెళ్లి రోజులు, పుట్టిన రోజులు, ఇతర శుభ కార్యక్రమాలు జరిగితే అనవసర ఖర్చులు పెట్టకుండా.. ఆకలితో ఉన్నవారికి ఒక్క పూట అన్నం పెట్టాలని సిక్కోలు ఉద్దానం సేవా సమితి ప్రతినిధులు కోరారు. శ్రీకాకుళం జిల్లాలో ఎవరికైనా అంబులెన్సు సర్వీస్ కావాలంటే సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఫోన్ నెంబర్.7207119285ను సంప్రదించాలని వారు కోరారు.





# బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

**సోంపేట జనవరి 9(వార్త):** విద్యార్థులు ఎంతో కీలకమైన ఇంటర్మీడియట్ డిగ్రీ స్థాయిలలో బంగారు భవిష్యత్తు కోసం చక్కనైన ఆలోచనలు ఆశయాలతో బంగారు బాటలు వేయాలని సోంపేటలో గల కొంచాడ రాజేశ్వర రావు జూనియర్, డిగ్రీ కళాశాలల చైర్మన్ కొంచాడా సూర్యప్రతాప్, కరస్పాండెంట్ కొంచాడ శేషాద్రి పేర్కొన్నారు. కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించిన ఫేర్‌వెల్ డే సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ముఖ్య ప్రసంగం చేశారు. ఇంటర్ దశ ఎంతో కీలకమైనదని చదువు కోసం సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగ పోటీ ప్రపంచంలో అవకాశాలు సాధించడమే లక్ష్యంగా నిరంతరం ప్రణాళికా బద్ధంగా విద్యార్థులు కృషి చేయాలని కోరారు. తల్లిదండ్రుల ఆశలు ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో సందడి చేశాయి. ఆటలు, పాటలతో హుషారైన స్టెప్పులతో విద్యార్థులు ఎంతగానో అలరించారు. ఇటీవల పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పరీక్షలో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి సాధించిన జామి తరుణ్‌కు రూ.5000లు, ద్వితీయ బహుమతి సాధించిన మైలపల్లి యశ్వంత్ కుమార్‌కు రూ.3000లు, తృతీయ బహుమతులు సాధించిన ప్రియా, మురారి, బుద్ధ రాహుల్‌కు రూ.2000లతో పాటు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను యాజమాన్య ప్రతినిధులు అందజేశారు. అనంతరం ఉన్నత స్థానంలో ఉన్న కళాశాల పూర్వ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ గున్న జయశంకర్, టి.తేజేశ్వరరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## మందసలో సామాజిక తనిఖీ



**మందస, జనవరి 9(వార్త):** మందసలో 18వ విడత సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ సమావేశం నిర్వహించగా.. పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ శాఖలకు సంబంధించి వేతనదారులకు వేతనాలు రూ.31.44 కోట్లు, మెటీరియల్ రూ.18.27 కోట్లు చెల్లింపులు జరిగాయని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ విభాగం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ శ్రీదేవి, ఎంపీడీఓ వై.వెంకటరమణ, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ రాజేంద్ర, డ్వామా ఏపీఓ రాజ్‌కుమార్, ఏపీఓ బీవీ హరికృష్ణ, ఈసీ చింతా సురేష్ వర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో మినీ సంక్రాంతి సంబరాలు



**మందస, జనవరి 9(వార్త):** వీరగున్నమ్మపురం సమీపంలో గల కేజీబీవీలో ప్రిన్సిపల్ రఘుపాత్రుని వాసంతి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. భోగి మంటలు వేసి, సంక్రాంతికి పాలు పొంగించారు. మంచి రంగవల్లులతో పాఠశాలను సుందరంగా అలంకరించారు. విద్యార్థినిలు, ఉపాధ్యాయులంతా కలసి, ఎంతో ఆనందంగా సంక్రాంతి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు జి.సంతోషిణి, బి.భాగ్యలక్ష్మి, ఎల్.లలితకుమారి, ఎం.ఇంద్రావతి, ఎల్.లావణ్య, ఎస్.మీనా, పి.భవాని, బి.భాగ్యలక్ష్మి, ఎస్.భాగ్యలక్ష్మి, పి.పావని, బి.అశ్విని, ఆర్.ఉమాసుందరి, ఎస్.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## కవిటి కళాశాలకు సంక్రాంతి శోభ



**సోంపేట, జనవరి 9(వార్త):** కవిటిలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందస్తు సంక్రాంతి శోభతో శుక్రవారం కళకళలాడింది. ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు కలసి ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, ఆట..పాటలు, పిండివంటలు అందరినీ కనువిందు చేశాయి. సంక్రాంతి సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేస్తూ కొనసాగించే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## డ్రగ్స్ వద్దు .. ఆరోగ్యమే ముద్దు..!

### -మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఎమ్.ఎల్.ఎస్.ఎ, ఎస్.బి.ఎస్.వై.ఎమ్. డిగ్రీ కళాశాలల సంయుక్త ర్యాలీ

**పలాస, జనవరి 9(వార్త):** జాతీయ యువజన ఉత్సవాల వారోత్సవాల్లో భాగంగా మండల న్యాయ సేవా సంఘం, శ్రీ శివ బాలయోగేంద్ర మహారాజ్ డిగ్రీ కళాశాల వారు సంయుక్తంగా మాదకద్రవ్య నిషేధం, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా, యువత అభివృద్ధిపై ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాలను మత్తుపదార్థాలను పూర్తిగా నిషేధించి యువత ఉన్నత విద్యను అభ్యసించి సమాజాభివృద్ధికి, దేశ అభివృద్ధికి మూల స్తంభాలు కావాలని యువతకు సూచించారు. స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని, సీనియర్ న్యాయవాది కె.దేవరాజు కోరారు. విద్యార్థులు " మత్తు వదలండి-ఆరోగ్యం పొందండి, సే ఎస్ టు లైఫ్ - నో టు డ్రగ్స్ వంటి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కె.లోకేశ్వరరావు, డి.శ్యామ్, కె.శ్రీనివాస్, పారా లీగల్ వాలంటీర్లు సునీల్‌కుమార్, దట్టి అనంతకుమార్, ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ టి.ప్రవీణకుమారి, కాలేజీ అధ్యాపకులు మాధురి, పావని, జయలక్ష్మ, బాలరాజు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# స్నేహ పూర్వకంగా మెలగాలి: ఎస్పీ



**మెళియాపుట్టి, జనవరి 9(వార్త):** వివిధ సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కి వచ్చే ప్రజలు, ఫిర్యాదుదారులతో పోలీసులు మమేకమై స్నేహపూర్వకంగా మెలగాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా పోలీసులు, సిబ్బందితో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వివిధ అంశాలపై మరింతగా అవగాహన కల్పించి నేరాలు తగ్గేవిధంగా మహిళా పోలీసులు బాధ్యత తీసుకోవాలన్నారు. పలు రికార్డులు పరిశీలించారు. నిత్యం సీసీ కెమెరాలు పనిచేసేవిధంగా చూడాలన్నారు. సంక్రాంతికి గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పాతపట్నం సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ రమేష్ బాబు, సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు ఉన్నారు.

# శ్రీకుమార్‌లో ఘనంగా ఫేర్‌వెల్ డే

**సోంపేట జనవరి 9(వార్త):** సోంపేటలోని శ్రీకుమార్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫేర్‌వెల్‌డే ఉత్సాహంగా .. ఉల్లాసంగా జరిగింది. డైరెక్టర్ ఎన్.రవికుమార్, ప్రిన్సిపాల్ జి.గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఇంటర్మీడియట్ నుంచి విద్యార్థులకు ఉన్నత విద్య చాలా క్రియాశీలకమైనదన్నారు. భవిష్యత్తును మలుపు తిప్పే ఇటువంటి దశను విద్యార్థులు ఎంతో చక్కగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమయాన్ని వృథా చేయకుండా చదువుపై ఏకాగ్రతతో ప్రతిభ పై ప్రధానంగా దృష్టి సారించి ఉన్నత లక్ష్యల సాధన కోసం అహర్నిశలు శ్రమించి బంగారు భవిష్యత్తుకు ఎప్పటినుంచే బాటలు వేయాలని కోరారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా వేసిన స్టెప్పులకు మిగతా విద్యార్థులు ఎగిరి గంతులేస్తూ కేరింతలు కొట్టారు.



# అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



**పలాస, జనవరి 9 (వార్త):** బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు విద్యార్థుల ఆట..పాటలతో, ఉపాధ్యాయుల ఆటలతో, భోగి మంటలతో గొబ్బిళ్లు ఆటలతో సంక్రాంతి పాటలతో అట్టహాసంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు తారకేశ్వర పండా మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకడం అంటే ఆ పండుగ వాతావరణం అసాధారణంగా ఉల్లాసంగా, ఆకాశాన్ని తాకడమేనని చెప్పారు. బ్రాహ్మణతార్ల వంటి ప్రాంతాల్లో ఉపాధ్యాయ, రైతుల కుటుంబాలు సంప్రదాయ దుస్తుల్లో కర్రాబిళ్లు, గోలీ ఆట, గాలిపటాలు, ముగ్గుల పోటీలతో సంబరాలు ఘనంగా జరిపారని చెప్పారు.

# రామకృష్ణాపురంలో అలరించిన ఉత్సవాలు

**పలాస, నవంబరు 9 (వార్త):** రామకృష్ణాపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయని ఆర్డీవో జి.వెంకటేష్ పేర్కొన్నారు. ఆ పాఠశాల ప్రాంగణంలో ఈ సంబరాలను అంగరంగ వైభంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సంక్రాంతి అంటే ఏమిటో నూటికి నూరు శాతము కళ్లకి కట్టినట్లు చూపించడం ప్రశంసనీయమన్నారు. నేటి తరానికి సనాతన సంప్రదాయము చూపించడం మనందరి బాధ్యతని, ఇంతటి బాధ్యతను శ్రీ సత్యసాయి విద్యావిహార్ వారు తమ భుజం మీద వేసుకోవడం అభినందనీయమన్నారు. ఇటువంటి పాఠశాలలో చవించడము తల్లితండ్రుల అదృష్టమని తెలిపారు. శ్రీ సత్యసాయి విద్యా విహార్ ట్రస్టు చైర్మన్ మల్ల రామేశం మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భోగి మంటలు, ముగ్గుల పోటీలు, పిండి వంటలు ప్రధానమైనవని, ఆవు పేడతో గొబ్బెమ్మలలో నవ ధాన్యాలు, రేగు పండ్లు, తంగెడు పూలు పెట్టి పూజలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ తాళాసు శ్రీనివాస్, పూర్వపు జిల్లా అధ్యక్షులు యెన్ని లింగరాజు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, శ్రీ సత్యసాయి సేవా సమితి పలాస కన్వీనర్ ఇప్పిలి తిరుమల, వైశ్య సంఘ అధ్యక్షుడు డోకి నాగేశ్వరరావు, ఉపాధ్యాయూలు అనుదీప్, మురళీ సాంబశివరావు, సూర్యతేజ, మౌనిక, అనిత, చంద్రశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.



## వెంకటసాయి విద్యాసంస్థల్లో సంక్రాంతి వేడుకలు



**సరుబుజ్జిలి, జనవరి 9(వార్త):** శ్రీ వెంకటసాయి విద్యాసంస్థలో భోగి పండుగ, సంక్రాంతి శోభను ప్రతిబింబించేలా భోగి మంటలు వేసి, చిన్నారులకు భోగి పండ్లు వేశారు. మన నాగరికత, ఆచారాలను తెలియ జేసేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో వెంకటసాయి విద్యాసంస్థల అధినేత కె.జగన్నాథం, ప్రిన్సిపాల్ బి.పురుషోత్తమరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబుగాం జెడ్పీహెచ్‌ఎస్‌లో సంక్రాంతి సంబరాలు



**మందస, జనవరి 9(వార్త):** అంబుగాంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీతమ్మ ఆధ్వర్యంలో భోగిమంట పెట్టి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కోదండరాం, మాలతీలత, దీనబంధు, భాస్కరరావు, ఎస్.కిరణ్‌కుమార్, డి.ప్రమీల, పీడీ జేజే రావు, తెలుగు ఉపాధ్యాయుడు కొల్లి ధనరాజు పాల్గొన్నారు.

## లింబుగాం పాఠశాలలో సూర్య నమస్కారాలు



**మందస, జనవరి 9(వార్త):** సూర్య నమస్కారాలు దినచర్యలో భాగం కావాలని లింబుగాం మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు జగన్మోహనరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆ పాఠశాలలో విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ క్రమం తప్పకుండా సూర్య నమస్కారాలు చేస్తే, మంచి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. శరీరం చెప్పినట్టుగా వింటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పిన్నిటి కొండలరావు, గున్న రాజు, దున్న మన్మథరావు, పూజారి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ పల్లి మోడల్ స్కూల్‌లో సంక్రాంతి సందడి



**సోంపేట, జనవరి 9(వార్త):** కంచిలి మండలం ఎంఎస్ పల్లిలోని ఏపీ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సందడి చేసింది. ఫుడ్ ఫెస్టివల్ విద్యార్థులతో నిర్వహించారు. సంక్రాంతి సంప్రదాయాలైన భోగి మంటలు, పిండి వంటలు, సంక్రాంతి ఆట..పాటలు ఎంతో కనువిందు చేశాయి. విద్యార్థులు ఉత్సాహంగా ఉల్లాసంగా రోజంతా గడిపారు.

## పాస్ పుస్తకాల పంపిణీలో జాగ్రత్త వహించండి



**జి.సిగడాం, జనవరి9(వార్త):** భూ సర్వే అయిన రెవెన్యూ ఆ గ్రామ రైతులకు పాసు పుస్తకాలు అందజేస్తున్నట్లు తహాసీల్దార్ మహాదేవుని సరిత తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో, వీఆర్ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల రైతులకు ఈకేవైసీ చేసి, వారికి రాజముద్రతో కూడిన పట్టా పాస్ అందజేస్తున్నామన్నారు. కొత్త పాస్ పుస్తకాలను పూర్తి స్థాయిలో పరిశీంచి సవరణ చేసి అందజేస్తారన్నారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదును స్వీకరించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్య పరిష్కార దిశగా పని చేస్తారని తెలిపారు. సమావేశంలో రీ సర్వే డీటీ కొత్తపల్లి గాయత్రి, ఆర్ఐ రాధ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన టౌన్ ప్రెసిడెంట్‌గా రుక్మంధర్ రెడ్డి

**ఇచ్ఛాపురం, జనవరి 9(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ జనసేన పార్టీ అధ్యక్షుడిగా పటాన రుక్మందర్ రెడ్డిని నియమించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తల్లూరి ఆదేశాల మేరకు, జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు సమక్షంలో జన సైనికులందరూ ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పటానా రుక్మందర్ రెడ్డి. ఉపాధ్యక్షుడిగా అనపాన రమేష్, లాడి శ్యామ్. ప్రధాన కార్యదర్శిగా అనపాన దుర్యోధన, తడక సురేష్, ప్రేమ్ కుమార్ సాహూ, ఉప ప్రధాన కార్యదర్శిగా కలియ గౌడ, దుర్గాసి సోమేశ్, చాట్ల శేఖర్‌రావు, తంద్ర ప్రసాద్, నీలాపు సతీష్, సీదిరి ఢిల్లీరావును నియమించినట్లు తెలిపారు. త్వరలోనే పార్టీ నుంచి అధికారికంగా ఈ పేర్లను ప్రకటిస్తారని చెప్పారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మెళియాపుట్టి మండల బడ్జెట్‌కు ఆమోదం

**మెళియాపుట్టి, జనవరి 9(వార్త):** మెళియాపుట్టి మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల బడ్జెట్ ఏకగ్రీ వంగా ఆమోదించారు. 2026- 27 బడ్జెట్‌కి సంబంధించి ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా ఆయా వివరాలను సభ్యులకు తెలియపరిచారు. 2025 - 26 సవ రణ, 2026-27 అంచనా బడ్జెట్‌ను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపా రు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ముందస్తు సంక్రాంతి సంబరాలు

**ఇచ్ఛాపురం, జనవరి 9 (వార్త):** ఇచ్ఛాపురంలోని స్వర్ణభారతి విద్యాసంస్థల్లో అధ్యక్షుడు చాట్ల తులసీదాసు రెడ్డి భోగి మంటను వెలిగించి సంక్రాంతి సంబరాల కార్యక్రమాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు స్వర్ణభారతి విద్యాసంస్థలు ప్రాధాన్యతినిస్తాయన్నారు. తెలుగువారు జరుపుకొనే అత్యంత ప్రాముఖ్యత కలిగినది సంక్రాంతి అన్నారు. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడంతో మకర సంక్రాంతిగా పిలుస్తారన్నారు. భోగి మంటలు, హరిదాసు కీర్తనలు, గంగి రెద్దుల ప్రదర్శనలు గాలిపటాలు ఎగురవేయటం, పశువులను పూజించటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆ విద్యాసంస్థల కోఆర్డినేటర్ చాట్ల మహేశ్వరి,జూనియర్ కళాశాల బాధ్యులు రాము, హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జల్లు జాయిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో విద్యార్థిని ప్రియ మహాపాత్రో హరిదాసు వేషధారణలో అందరినీ ఆకట్టుకుని మన్ననలు పొందింది. భోగి మంట వెలిగించి ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలకుమారి విద్యార్థులకు భోగి, సంక్రాంతి, కనుమ విశేషాలు గురించి చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేంద్ర నాథ్ పట్నాయక్, రామ్మోహన్‌రావు, జ్యోతి, రేణుక, చంద్రవదన, అమితబెహ రా, శ్రీనివాస్ పూండి, గొలివి పాపారావు, మినుచంద్ర, నీలిప్, ఉప్పాడ పాపా రావు, కోటేశ్వరరావు, దేవకీ, వాణి, స్వప్నారాణి, కిరణ్ పాల్గొన్నారు. రవీంద్ర భారతి స్కూల్‌లో ప్రిన్సిపాల్ గేదెల కన్నంనాయుడు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. బాలుర జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ శరత్ బాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.



### లక్ష్మీనర్సుపేట పాఠశాలలో..

**ఎల్ఎన్‌పేట, జనవరి 9(వార్త):** లక్ష్మీనర్సుపేట గ్రామంలో మోడల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సూర్య నమస్కారాలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.రమాదేవి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లయన్.ఎం.కె.మిశ్రో, ఉపాధ్యాయులు ఎన్.రామారావు, పి.లక్ష్మణరావు, టి.ఉపేంద్ర, మధ్యాహ్నం భోజనం కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### గోవిందపురంలో..

**పలాస, జనవరి 9 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం పూండి గోవిదంపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో భోగి మంటలు వేసి నృత్యాలు చేశారు. హరిదాసులు, గంగరెద్దులతో ఆట పాటలు, వివిధ రకాల పిండి వంటలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్, అధ్యాపకులు కేశవరావు, జాన్నీ, విద్యార్థులు పాల్గొన్నారు.



### అవలంగి పాఠశాలలో..

**సారవకోట, జనవరి 9 (వార్త):** అవలంగి గ్రామంలోని జేపీటీ పాఠశాలలో భోగి పండుగను పర్యావరణ హితంగా నిర్వహించారు. విద్యా ర్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్థుల సహకారంతో ఆవు పేడతో తయారు చేసిన 50వేల భోగి పిడకలను సిద్ధం చేసి శుక్రవారం ముందస్తు భోగి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### జూనియర్ కళాశాలలో..

**సోంపేట జనవరి 9(వార్త):** సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ప్రిన్సిపాల్ మోహన్ రావు ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. ముందస్తు సంక్రాంతి లో భాగంగా కళాశాల ఆవరణలో ముగ్గులతో రంగుల శోభ ఆకట్టుకుంది. భోగిమంటలతో సందడి చేశారు. ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో, అధ్యాపకులు, అధ్యపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## రాజ ముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

**ఎల్ఎన్‌పేట, జనవరి9(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రీ సర్వే జరిగిన గ్రామాల రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందని మండల టిడిపి యువ నాయకులు అంపిలి పోలినాయుడు అన్నారు. మండలంలోని కొమ్మువలస గ్రామంలో శుక్రవారం రాజముద్రతో రూపొందించిన పట్టాదారు పాస్ పుస్తకాలను రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, సర్పంచ్ రెడ్డి సీతారాం, టిడిపి నాయకులు పొన్నాన రామకృష్ణ మాస్టారు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


**సోంపేట జనవరి 9 (వార్త):** రాజముద్రతో కూడిన రైతుల కొత్త పాస్ పుస్తకాలను జలంధర సోంపేట రెవెన్యూ రైతులకు శుక్రవారం అందజేశారు. సంబంధించి మంజూరైన పుస్తకాలను డిప్యూటీ తహసిల్దారు మహేశ్వర్ రావు ఆధ్వర్యంలో రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కోదండరామ ఆలయ ట్రస్ట్ చైర్మన్ బీన ఆనందరావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు చిత్రాడ శేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం,జనవరి 9 (వార్త):** ఇచ్ఛాపురం మండలం ధర్మపురం, లొద్దపుట్టి పంచాయితీల లో కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన రాజముద్ర పట్టాదారు



పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. తహశీల్దార్ ఎన్.వెంకటరావు, డిప్యూటీ తహశీల్దార్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దక్కత ఢిల్లీరావు, డి కామేశ్వరరావు, సంతోష్ కుమార్, ఎస్ సహదేవ్, ఆర్ఐ సాహు, పి హేమరాజు, మోహన్ రావు, సోమయ్య, విఆర్‌వో సోమయ్య, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





## సబ్సిడీతో మత్స్యకారులకు చేపపిల్లలు

* పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు
* నౌగూడ చెరువులో చేప పిల్లలు విడుదల

**హిరమండలం,జనవరి9(వార్త):** నౌగూడ గ్రామ చెరువులో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం సబ్సిడితో చేప పిల్లలను అందజేస్తుందన్నారు. అలాగే సీతంపేట ఐటిడీఏ సబ్ ప్లాన్ మండలాల పరిధిలో ఉన్న 2,600 గిరిజన మత్స్యకారుల కుటుంబాలకు 21లక్షల చేప పిల్లలను ఉచితంగా అందించాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితులు తూలుగు తిరుపతిరావు, ఏఎంసీ చైర్మన్ మామిడి రామక్రిష్ణ, ఎంపీడీవో ఆర్ కాళీప్రసాదరావు, హిరమండల మండల పట్టణ టిడిపి అధ్యక్షులు పోతురాజుశ్రీధర్, మండల టిడిపి అధ్యక్షులు ధారపు డిల్లేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తట్ల శంకరరావు, లంక రోజారాణి, మత్స్యశాఖ సిబ్బంది విఎఫ్ఎలు శ్రీరత్న, ప్రభావతి, టిడిపి నాయకులు నెయ్యల రామారావు కార్యకర్తలు పాల్గొన్నారు.



### బాలకృష్ణాపురంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

**ఇచ్ఛాపురం, జనవరి9 (వార్త):** స్వచ్ఛ సంక్రాతి స్పెషల్ శానిటేషన్‌లో భాగంగా బాలకృష్ణాపురం గ్రామ పంచాయతీ ప్రాంతాలలో స్పెషల్ శానిటేషన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమారి, ఎంపిడిఓ ప్రభాకర్ రావు, సర్పంచ్ ప్రతినిధి లోహిదాస్, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ ఉదయ్ కిరణ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మనోజ్ పాల్గొన్నారు.

## సూర్య నమస్కారాలతో ఆరోగ్యం

**సారవకోట, జనవరి 9(వార్త):** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యోగా గురువు, ఉపాధ్యాయుడు వేణుగోపాలరావు పేర్కొన్నారు. శుక్రవారం వాండ్రాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగాపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో అనేక రోగాల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## పీహెచ్‌సీల్లో గర్భిణీలకు వైద్య పరీక్షలు

**జలుమూరు,జనవరి 9 (వార్త):** అచ్యుతాపురం, జనుములు, శవరిగ పీహెచ్‌సీల్లో శుక్రవారం గర్భిణీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. అచ్యుతాపురం పీహెచ్‌సీలో 30 మంది గర్భిణీలను డాక్టర్లు పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా సాయిరాం సత్య సేవ భజన మండలి (అచ్యుతాపురం), నగిరి కాటకం భజన మండలి సభ్యులు గర్భిణీలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్షణరావు గర్భిణీలకు చీరలను అందజేశారు. అదేవిధంగా జనుములు పీహెచ్‌సీలో 17 మంది, శవరిగ పీహెచ్‌సీలో 25 మంది గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లు పరిశీలించారు. మూడు పీహెచ్‌సీల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. సుజాత, ప్రసన్నకుమారి, జి. సుజాత, ఎం. సంధ్యారాణి, హేమలత తదితర వైద్యులు పాల్గొన్నారు.



## ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

**పలాస, జనవరి 9 (వార్త):** కాశీబుగ్గ రోటరీ నగర్‌కు చెందిన దేవలింగం మహేష్ (27) ఇంట్లో ఫ్యాన్ కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వజ్రపుకొత్తూరు మండలం బెండి గ్రామానికి చెందిన మహేశ్‌కు పలాస మండలం వీరభద్రాపురానికి జ్యోత్స్నతో ఏడాది క్రితం వివాహమైంది. భార్యతో కలిసి కాశీబుగ్గ రోటరీ నగర్ లో నివాసం ఉంటూ డెలివరీ బాయ్ గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలు కారణంగా మహేష్ ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు చెబుతున్నారు. కుమారుడు మహేష్ మృతికి తన కోడలు వేధింపులే కారణమని, మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నేడు జిల్లాకు మరో 2వేల టన్నుల యూరియా

**శ్రీకాకుళం, జనవరి 9(వార్త):** జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత లేదని, రైతులకు అవసరమైన యూరియాను నిరంతరం అందుబాటులో ఉంచుతున్నామని జిల్లా వ్యవసాయ అధికారి కె. శ్రీనాథ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో అన్ని రకాల పంటలకు గాను మొత్తం 26,000 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. గతేడాది అక్టోబరు 1 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 15,235 మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయని వెల్లడించారు. ప్రస్తుతం వివిధ కేంద్రాల్లో 996 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధంగా ఉందని, శుక్రవారం నాటికి శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌కు మరో 2,000 మెట్రిక్ టన్నుల నిల్వలు రానున్నాయని ఆయన వివరించారు. యూరియాతో పాటు ఇతర ఎరువులు కూడా రైతులకు అందుబాటులో ఉన్నాయని డీఏఓ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో డి.ఎ.పి 1265 టన్నులు, పొటాష్ 762 టన్నులు, కాంప్లెక్స్ 1687 టన్నులు, ఫాస్ఫేట్ 619 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, వరి సాగు చేసే రైతులకు దఫాదఫాలుగా ఎరువులు అందజేస్తున్నామని.. కేవలం యూరియాపైనే కాకుండా భాస్వరం, పొటాష్ వంటి ఇతర పోషక ఎరువుల వినియోగంపై కూడా రైతులు దృష్టి సారించాలని సూచించారు. క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం దుకాణాలను తనిఖీ చేస్తూ నిల్వల వివరాలను వాట్సాప్ ద్వారా రైతులకు చేరవేస్తున్నారని చెప్పారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సాంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నాయంగా వస్తున్న నానో యూరియా, నానో డి.ఎ.పిలను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఎరువుల విక్రయాల్లో కృత్రిమ కొరత సృష్టించినా, ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించినా డీలర్ల లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా ఎరువుల నియంత్రణ చట్టం-1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు పొందాలని డీఏఓ సూచించారు.

## శివరాంపురంలో గడ్డి కుప్పలు దగ్ధం

**సంతబొమ్మాళి, జనవరి 9 (వార్త):** శివరాం పురం గ్రామం శుక్రవారం రెండు గడ్డి కుప్పలు కాలి బూడిదయ్యాయి. స్థానిక స్మశాన వాటికకు దగ్గరలో ఉన్న దున్న రాముకు చెందిన రెండు గడ్డి కుప్పలు ఉదయం 10.30గంటల సమయంలో కాలిపోయాయి. కల్లాం లో చేరిన చెత్తకు మంట పెట్టె క్రమంలో నిప్పులు పక్కనే ఉన్న చింత చెట్టు పై పడి చెట్టు కాలిపోయింది. ఈ మేరకు చెట్టు సమీపంలో ఉన్న ఈ రెండు గడ్డి కుప్పలకు మంటలు అంటుకొని కాలి బూడిదయ్యాయి. గ్రామస్తులు వెంటనే కోటబొమ్మాళి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా ఫైర్ ఇంజన్ వచ్చి సుమారు మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు 6ఎకరాల వరి చేనుకు సంబందించిన గడ్డి కాలిపోవడంతో పశువులకు పశుగ్రాసం లేకుండా పోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.



### ఏడు రోజులు.. ఏడు రంగులు.. ఏడు చక్రాల స్ఫూర్తితో..

# రథసప్తమి వేడుకలు

- **సిక్కోలులో రథసప్తమికి అంకురార్పణ**
- **ప్రచార రథాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే**
- **ఈనెల 19 నుంచి 25 వరకు వేడుకలు**

శ్రీకాకుళం, జనవరి 9(వార్త): రథసప్తమి వేడుకలను ఈ ఏడాది ఏడు రోజుల పాటు రాష్ట్ర పండుగగా వైభవంగా నిర్వహిస్తున్నామని, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక చైతన్యం నింపేలా ప్రతి ఒక్కరూ ఈ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం అరసవల్లి దేవస్థాన ప్రాంగణంలో రథసప్తమి ఉత్సవాలకు అధికారికంగా అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యుని ఏడు గుర్రాలు, ఏడు రంగులు, శరీరంలోని ఏడు చక్రాలకు ప్రతీకగా ఈనెల 19 నుంచి 25 వరకు ఏడు రోజుల పాటు విభిన్న కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. అనంతరం ఉత్సవాల విశిష్టతను చాటిచెప్పే 'అరసవల్లి ప్రచార రథన్ని' వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడు రోజుల ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ముందెన్నడూ లేని విధంగా శోభాయాత్రలు, హెలికాప్టర్ రైడ్స్, హాట్ ఎయిర్ బెలూన్ వంటి ప్రత్యేక ఆకర్షణలు ఉండనున్నాయన్నారు. కేఆర్ స్టేడియంలో సాంస్కృతిక ప్రదర్శనలు, ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో 'ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తామని చెప్పారు. అరసవల్లి రథం మీ గ్రామానికి వచ్చినప్పుడు భక్తులంతా స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. రథసప్తమి రోజున రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏడు రోజుల పాటు దర్శనాలకు అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రానున్న 10 రోజుల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, నివాస సముదాయాల ప్రాంగణాల్లో సూర్యనమస్కారాలు చేయాలని కోరారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ బాలిక ఉన్నత పాఠశాలలో భారీ



ఎగ్జిబిషన్, కేఆర్ స్టేడియంలో అరసవల్లి ఆలయ నమూనా, సహా రాష్ట్రంలో పలు ప్రముఖ దేవాలయాల నమూనాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ నృత్యాలు, కళలు, ఆటల పోటీలకు పెద్దపీట వేస్తున్నామని, జిల్లా ప్రతిష్ట ఉట్టిపడేలా ఈ వేడుకలు ఉంటాయన్నారు. అంకురార్పణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, జిల్లా ఆయుష్ వైద్యాధికారి జగదీష్, యోగా గురువులు కె. మురళీధర్, పాండ్రంకి మురళి, తంగి స్వాతి, మంత్రి సత్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ డిడి మధుసూదనరావు, అరసవల్లి ఈఓ ప్రసాదరావు, సూర్య పతంజలి యోగా సెంటర్ విద్యార్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





### ఉద్యోగం చేసుకోండి..

## రాజకీయాలు చేయొద్దు

- **నౌపడ వీఆర్వోపై అధికార పార్టీ నాయకులు ఆగ్రహం**

**సంతబొమ్మాళి, జనవరి 9 (వార్త):** సక్రమంగా ఉద్యోగం చేసుకోవాలని, ప్రజలకు పథకాలు అందేలా చూడాలని, అలా కాదు రాజకీయాలు చేస్తానంటే ఊరుకునేది లేదని నౌపడ వీఆర్వో దుక్క జోగారావుపై అధికార పార్టీ నాయకులు శుక్రవారం మండిపడ్డారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో అధికార పార్టీలో వర్గాలను సృష్టిస్తు ఒక వర్గం వారిని పిలిచి మమ్మల్ని పిలవకపోవడం ఏంటని వీఆర్వోపై మాజీ ఎంపీపీ ప్రతినిధి కర్రి విష్ణుమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో సచివాలయ సిబ్బంది మొదటి నుంచి తమను ఎందుకు ఆహ్వానించడం లేదని దీనికి సమాధానం చెప్పాలన్నారు. అధికార పార్టీలో సీనియర్ నాయకుడినని, రెండు సార్లు సర్పంచ్‌గా, ఒకసారి ఎంపీపీగా పనిచేసిన తనను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. నౌపడ సచివాలయం సిబ్బందిలో వీఆర్వో గ్రూపులను సృష్టించి పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. గతంలో చాలాసార్లు ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించకపోయినా ఓర్పుతో వ్యవహరిస్తున్నానని ఇప్పుడు కూడా అలాగే చేస్తున్నారన్నారు. మమ్మలను ఆహ్వానించొద్దని ఎవరైనా మీకు చెబుతున్నారా అని ప్రశ్నించారు. మీరు చేసిన అవినీతి అక్రమాలు అన్ని తెలుసునని ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని సమన్వయం పాటిస్తున్నానన్నారు. వీఆర్వో జోగారావు తీరుపై తహసీల్దార్ హేమ సుందర్ రావుకు ఎంపీపీ ప్రతినిధి కర్రి విష్ణుమూర్తి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకుని వెళ్తానని అన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సుగ్గు చిన్నారెడ్డి, సుగ్గు నాగిరెడ్డి, అనపాన నగేష్ తదితరులు ఉన్నారు.

## 21 నుంచి జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు

**శ్రీకాకుళం, జనవరి9(వార్త):** వమరవెల్లి డైట్‌లో ఈనెల 21 నుంచి జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవి బాబు శుక్రవారం తెలిపారు. విద్యార్థులు తమలోని ప్రతిభను స్వేచ్ఛగా, సృజనాత్మకంగా చూపించుకునే వేదికని, పిల్లల్లో ఆనందం, ఉత్సాహం పెంచుతూ వారి సమగ్ర అభివృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. చిత్రలేఖన పోటీలో భారత స్వాతంత్ర్య సమరయోదుల చిత్రాలను గీయడం, హ్యాండ్ రైటింగ్ పోటీలో ఒక పేరాగ్రాఫ్ లేదా ఒక కొటేషన్ (మంచి మాటలు, సూక్తులు, స్ఫూర్తినిచ్చే వాక్యాలు) తెలుగు, ఇంగ్లీషులో రాయడం, రంగోలి పోటీ వికసిత్ భారత్ అంశంపైన 3 నుంచి 4 మంది సభ్యులు రంగోలి రూపొందించడం, పంజాబీ జానపద నృత్యం / ఆంధ్రప్రదేశ్ జానపద నృత్యం (4-5 మంది సభ్యులు), రోల్ ప్లే వికసిత్ భారత్ అంశంపై: (3-4 మంది సభ్యులు) భారత సంస్కృతి, చరిత్ర, విలువల వికసిత భారత్ పై ఆధారిత దృశ్య ప్రదర్శన చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలలో 6 నుండి 8వ తరగతుల విద్యార్థులు (రాష్ట్ర లేదా కేంద్ర బోర్డులకు అనుబంధమైన పాఠశాలలు) రంగోత్సవ్ 2025-2026 లో పాల్గొనవచ్చన్నారు. ఒక్క విద్యార్థి ఒక్క పోటీలో మాత్రమే పాల్గొనాలని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా స్థాయి పోటీలు ఈనెల 21న ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమవుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ముందుగా గూగుల్ ఫామ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సివుంటుందని, ముందుగా రిజిస్ట్రేషన్ చేసిన వారికే పోటీలకు అనుమతించబడుతుందన్నారు. ఈనెల 18లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని డైట్ ప్రిన్సిపల్ గౌరీ శంకర్ రావు తెలిపారు, పోటీల ప్రారంభానికి 60 నిమిషాల ముందే వేదిక వద్ద హాజరుకావాల్సివుంటుందన్నారు. పోటీలలో పాల్గొనేందుకు అవసరమైన చిత్రలేఖనం కాగితం, రంగులు, అవసరమైన సామగ్రిని విద్యార్థులే తీసుకురావాలని, విజేతలకు ట్రోఫీలు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేయబడతాయని తెలిపారు. పోటీలు నిర్వహింపబడిన ఐదు అంశాలలో ప్రతి అంశం నుండి జిల్లా స్థాయిలో మొదటి బహుమతి పొందినవారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయబడతారని, రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 23న మురళి రిసార్ట్స్, పోరంకి, విజయవాడలో నిర్వహిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు జీవి రమణ ఇంచార్జ్ ప్రిన్సిపల్,డైట్, వమరవెల్లి, మొబైల్ నెంబర్ 9491813995, ఆశింటి వేణుగోపాలరావు, నోడల్ ఆఫీసర్, డైట్, వమరవెల్లి, మొబైల్ నెంబర్ 8985485617ను సంప్రదించాలన్నారు.

## 12న సంక్రాంతి సంబరాలు

**శ్రీకాకుళం, జనవరి 9(వార్త):** సంక్రాంతి పండుగ పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన జిల్లా స్థాయి సాంప్రదాయ క్రీడల పోటీలు నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో 12వ తేదీ ఉదయం 9 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయి. ఈ వేడుకల్లో భాగంగా మహిళలకు స్కిప్పింగ్, తొక్కుడు బిళ్ళ పోటీలు, పురుషులకు లాగోరి (7 పెంకులాట), గాలిపటాల పోటీలు నిర్వహిస్తారు. అలాగే పురుషులు, మహిళలకు కర్రసాము మరియు టగ్ ఆఫ్ వార్ పోటీలు ఉంటాయని అధికారులు వెల్లడించారు. జిల్లాలోని ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ నైపుణ్యాన్ని చాటుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎ. మహేష్ బాబు కోరారు. పాల్గొనదలచిన పురుష, మహిళా క్రీడాకారులు జనవరి 12వ తేదీ ఉదయం 9 గంటలకు కోడి రామ్మూర్తి స్టేడియం వద్ద హాజరు కావాలి. పోటీలకు సంబంధించిన ఇతర వివరాల కోసం 9390352942 లేదా 7680075375 మొబైల్ నంబర్లను సంప్రదించవచ్చు లేదా Srikakulam.dsa@gmail.com కు ఈమెయిల్ చేయవచ్చు. గ్రామీణ, సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీలలో జిల్లా వాసులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

## అలివేలు మంగమ్మ నేత్రదానం

**శ్రీకాకుళం, జనవరి 9 (వార్త):** మరణించినా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆ కుటుంబం తీసుకున్న నిర్ణయం అందరికీ ఆదర్శంగా నిలిచింది. బూర్జ మండలం అయ్యావారిపేటకు చెందిన బైరి అలివేలు మంగమ్మ (68) ఇటీవల మృతి చెందగా, ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుమారుడు అనిల్‌కుమార్, ఇతర కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఈ సమాచారంతో రెడ్‌క్రాస్ ప్రతినిధులు, ఐ-టెక్నీషియన్ పి.సుజాత బృందం మృతురాలి నుంచి కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర నిధికి తరలించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. నేత్రదానం మహాదానమని, అంధత్వ రహిత సమాజం కోసం యువత కృషి చేయాలన్నారు. దాత కుటుంబాన్ని రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు. నేత్రదానం చేయదలచిన వారు 78426 99321 నంబరును సంప్రదించాలని కోరారు.

## వ్యాధులపై అప్రమత్తత అవసరం

**జి.సిగడాం,జనవరి 9(వార్త):** శీతాకాలం లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ప్రతిష్ట శర్మ, అనూష సూచించారు. శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఆరోగ్య కార్యకర్తలు పేడాడ సత్తెరాజు, తదితరులు పాల్గొన్నారు.






## మత్తుకు బానిస కావొద్దు

**శ్రీకాకుళం, జనవరి 9 (వార్త):** నేటి యువత మత్తు పదార్థాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును బుగ్గి పాలు చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు హితవు పలికారు. శుక్రవారం గూడెం గ్రామంలో నేషనల్ యూత్ డే వారోత్సవాలను నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం కారణంగా యువశక్తి పెడదారి పడుతోందని హరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో జరుగుతున్న సకల అనర్థాలకు, అరాచకాలకు, చివరకు హత్యలకు సైతం డ్రగ్స్ వాడకమే ప్రేరణగా నిలుస్తోందని పేర్కొన్నారు. యువతను మత్తులో ముంచి చిత్తు చేసే మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేయడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, గంజాయి వంటి మత్తు పదార్థాలను అక్రమంగా చిన్న పిల్లల దశ నుంచే అలవాటు చేస్తూ వారి ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులు ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై. పోలినాయుడు, బి. మోహనరావు, ఆదినారాయణ, ఆర్. శ్రీనివాసరావు, సర్పంచ్ ఎం.వి.ఎ. రాజులు, డి. శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పదివేలు జరిమానా

**సోంపేట జనవరి 9(వార్త):** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితునికి సోంపేట న్యాయస్థానం పదివేల రూపాయల జరిమానా విధించింది ఈ మేరకు కేసు వివరాలను సీఐ బి మంగరాజు శుక్రవారం వెల్లడించారు. సోంపేట పట్టణం కొత్తపేట వీధికి చెందిన ఎలుకల నిఖిల్ కుమార్ డిసెంబర్ 31 రాత్రి మద్యం సేవించి వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు విచారణ అనంతరం గురువారం మెజిస్ట్రేట్ కే శ్రీనివాసరావు నిందితునికి పదివేల రూపాయల జరిమానా విధించారని సీఐ తెలిపారు.

## పోలీసు కానిస్టేబుళ్ల శిక్షణ ప్రక్రియ పరిశీలన

**శ్రీకాకుళం, జనవరి 9(వార్త):** తండేవలస జిల్లాపోలీసు శిక్షణ కేంద్రంలో పోలీసు కానిస్టేబుళ్లకు అందిస్తున్న శిక్షణ విధానాలను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి శుక్రవారం పరిశీలించారు. శిక్షణ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రతి అంశాన్ని క్షణ్ణంగా తెలుసుకోవాలని తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట శిక్షణ కేంద్ర అధికారులు, బోధక సిబ్బంది ఉన్నారు.



## అక్రమ కేసులు ఎత్తివేయాలని ధర్నా

**శ్రీకాకుళం, జనవరి 9(వార్త):** రాష్ట్రంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై అక్రమంగా బనాయించిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, విద్యారంగం, నిరుద్యోగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యువజన, విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు డా. పూడి కిరణ్ కుమార్, వైయస్సార్ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మార్పు పృథ్వి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బొత్స సంతోష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కే. సాయికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు, వైయస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు విజయ్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై అనేక అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఎన్నికల సమయంలో, యువగళం పాదయాత్రలో ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2,35,000 ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం కూడా ప్రకటించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు దానిని ప్రకటించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి విద్యారంగం, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని, లేనియెడల భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతమైన పోరాటాలకు సిద్ధమవుతామని నాయకులు హెచ్చరించారు. ఈ ధర్నాలో పలు యువజన, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




### సాంకేతిక అప్లికేషన్లతో

## కేసుల దర్యాప్తు మరింత వేగవంతం

### జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం, జనవరి 9 (నేడు న్యూస్):** కేసుల దర్యాప్తులో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, వేగవంతమైన విచారణ సాధించడంలో సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత స్మార్ట్ పోలీసింగ్ కీలకమని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో, జిల్లాలో అమలులో ఉన్న శాఖాపరమైన స్మార్ట్ పోలీసింగ్ విధానమైన సాంకేతిక అప్లికేషన్ల వినియోగం, కేసుల పురోగతి, ఆన్‌లైన్ పోర్టల్స్‌లో సమాచారం నమోదు విధానాలను జిల్లా ఎస్పీ సమీక్షించారు. ప్రతి పోలీసు అధికారి సాంకేతిక అప్లికేషన్లపై సంపూర్ణ అవగాహనతో పూర్తి స్థాయిలో నైపుణ్యం సాధించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 కాల్స్‌కు తక్షణ స్పందన ఇవ్వాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మారుమూల ప్రదేశాలు, నిర్మానుష్యమైన ప్రాంతాల్లో డ్రోన్ నిఘా ద్వారా చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు కె.వి. రమణ, పి. శ్రీనివాసరావు, డీఎస్పీలు షేక్ షాహాబాజ్ అహ్మద్, సి.హెచ్. వివేకానంద, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546